www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 10 ఆగస్టు 2025




రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికల నేపథ్యంలో కడప డివిజన్ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున 11వ తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు జిల్లా కేంద్రానికి రావడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చును. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవాలనుకున్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేసి తెలుసుకోవచ్చునన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

ప్రలోభాలకు వేళాయే!

- యథేచ్ఛగా నగదు పంపిణీ
- ఓటుకు రూ.2 వేలు
- నేటితో ప్రచారానికి తెర



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని జడ్పిటిసి ఉప ఎన్నికల్లో ప్రలోభాలకు తెరలేచింది. ఎన్నిక ఏదైనా సరే ఓటుకు నోటు పంపిణీ చేయడం పరిపాటిగా మారింది. ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నాలుగు రోజుల ముందే శ్రీకారం చుట్టారు. ప్రజాస్వామ్యంలో ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా ఓట్లు వేయించుకోవాలి. ప్రస్తుతం అటువంటి ఆదర్శానికి విరుద్ధంగా ఓటుకు నోటు పంపిణీలో వైసిపి, టిడిపి అభ్యర్థులు మునిగి తేలుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వీరిలో ఎవరికీ ఎవరూ తీసిపోకుండా నువ్వానేనా అనే రీతిలో పోటీలు పడి డబ్బులు పంపిణీ చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. నేటితో ఉప ఎన్నికల ప్రచారానికి తెరపడనున్న నేపథ్యంలో తెరవెనుక మంత్రాంగం జోరందు కుంది. ఈ నెల 12న ఉప ఎన్నికల ఓటింగ్ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఓటరుకు పెద్దఎత్తున నగదు పంపిణీకి శ్రీకారం చుట్టారు.

జిల్లాలోని జడ్పిటిసి ఉప ఎన్నికల్లో ఓటుకు నోటు యథేచ్ఛగా సాగుతోంది. కడప, అన్నమయ్య జిల్లాలోని పులివెందుల, రాజంపేట అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పులివెందుల, ఒంటిమిట్ట స్థానాల్లో ఉపఎన్నిక జరుగుతోంది. పులివెందుల పరిధిలో 10,600 ఓటర్లు, ఒంటిమిట్ట పరిధిలో 26,800 వరకు ఓటర్లు ఉన్నారు. వీటి పరిధిలోని 80 శాతం ఓటర్లకు నగదు పంపిణీ చేయడానికి ఆయా రాజకీయ పార్టీల కార్యకర్తలు బృందాలుగా విడిపోయి నగదు పంపిణీ వ్యవహారాన్ని పకడ్బందీగా చేపడుతున్నారు. ఉభయ జిల్లాలోని పలువురు నాయకులు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు తమ వంతు భారీగా విరాళాలను సమకూర్చినట్లు ప్రచారంలో ఉంది.

పోలింగ్ బూత్‌ల వారీగా...

కడప జిల్లాలోని పులివెందులలో 15, అన్నమయ్య జిల్లాలోని ఒంటిమిట్ట మండలాల్లో 30 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఆయా గ్రామీణ ప్రాంతాల ఓటర్లకు నగదు పంపిణీని వేగవంతం చేశారు. శుక్రవారం సాయంత్రం నుంచి మంగళవారం వరకు నగదు పంపిణీ చేపట్టనున్నారు. శుక్రవారం వైసిపి ఒంటిమిట్ట మండలం తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు, గంగపేరూరు, నరవకాటిపల్లి ప్రాంతాలు, టిడిపి సాలాబాద్, రాచపల్లి ప్రాంతాల నుంచి నగదు పంపిణీకి శ్రీకారం చుట్టింది.

ఓటుకు రూ.2 వేలు

ఒంటిమిట్ట జడ్పిటిసి పరిధిలోని ఓటుకు రూ.రెండు వేల చొప్పున నగదు పంపిణీ యథేచ్ఛగా సాగిపోతోంది. పులివెందుల పరిధిలో పెద్దఎత్తున నగదు పంపిణీ చేయడానికి కసరత్తు జరుగుతోంది. పులివెందుల పరిధిలో నలపురెడ్డిపల్లి, యర్రబల్లి, ఇ.కొత్తపల్లి, నల్గొండువారిపల్లి, కణంపల్లి, రాగిమానుపల్లి, అచ్చిగల్లి, ఎర్రిపల్లి పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 12 గ్రామాల్లో పెద్దఎత్తున నగదు పంపిణీకి కసరత్తు జరుగుతోంది. ఒంటిమిట్ట మండల పరిధిలోని 13 పంచాయతీల పరిధిలోని 26 గ్రామాల్లో రాజకీయ పార్టీల కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి నగదు పంపిణీ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నారు. వైసిపి నాయకత్వం నగదు ఎన్నికల ప్రచారం మొదలు, నగదు పంపిణీ అంశాల్లో వ్యూహాత్మకంగా ముందంజలో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఒంటిమిట్ట మండల టిడిపి నాయకుల్లో గ్రూపు విభేదాలు, నగదు పంపిణీ వ్యవహారంలో వెనుకబాటుతనం కనిపిస్తోంది. ఏదేమైనప్పటికీ ప్రలోభాలకు తెరలేచిన నేపథ్యంలో ప్రజాస్వామ్యానికి ఎనలేని హాని తలపెడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

పులివెందులపై జగన్‌ది కపట ప్రేమ

- మంత్రి కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, చిత్రంలో మంత్రి సవిత

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పులివెందుల ప్రాంత ప్రజలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కపటి ప్రేమ తప్ప ప్రేమ లేదని, అభివృద్ధి చేయకుండా మోసం చేశారని, తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ ఉందని గృహ నిర్మాణ, ఐఅండ్‌పిఆర్ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, అనంతపురం జిల్లా టిడిపి నాయకులు సాంబశివుడుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ బయట ప్రాంతం వారు పులివెందుల ప్రాంతంలో తెలుగుదేశం పార్టీకి ఆదరణ ఉండదని అనుకోవడం జరుగుతుందని తెలిపారు. నేను వచ్చి ఇక్కడ స్థానిక నాయకులతో పలు గ్రామాల్లో పర్యటించిన ప్రతిచోట తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ ఉందని, ఎక్కడ చూసినా ప్రజలు స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. ఉప ఎన్నికలలో మారెడ్డి లత తప్పక విజయం సాధిస్తుందన్నారు. జగన్ తన సొంత నియోజకవర్గంలోని ప్రజలకు కూడా న్యాయం చేయలేకపోయారని, ఇక్కడ కనీస అవసరాలు కూడా తీర్చకుండా కాలయాపన చేస్తూ కేవలం బటన్లు నొక్కడానికి పరిమితమయ్యాడే తప్ప ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేయలేదని విమర్శించారు. వైసిపి నుంచి టిడిపిలోకి వచ్చిన వారి పొలాల వద్ద రోడ్లకు అడ్డంగా గోడలు కట్టడం, పొలాల్లోకి వెళ్లకుండా అడ్డగించడం, అప్పులు చెల్లించాలని బలవంతం చేయడం ఇలా అనేక రకమైన కారణాలతో ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఇబ్బందులు కలిగించినా ప్రజలు ఒకసారి ఓటు వేయాలని నిర్ణయించుకుంటే వారిని ఎవరూ ఆపలేరని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు ముందుకు వెళుతుందన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలన్నీ దరిదాపు పూర్తయ్యాయని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమం కోసం ఎప్పుడు ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు. అరటిపండు నిల్వ ఉంచే కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేసి, పనులు పూర్తి చేయలేదన్నారు.

వాళ్లకు వాళ్లే దాడి చేసుకుని మాపై నిందలా? : బీటెక్ రవి

జడ్‌పిటిసి ఉప ఎన్నిక సందర్భంగా వైసిపి నేతలు వాళ్లకు వాళ్లే దాడి చేసుకుని మాపై నింద వేయడానికి ప్లాన్ చేస్తున్నారని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి విమర్శించారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ స్వతంత్ర అభ్యర్థులుగా వైసిపి వ్యక్తులే నామినేషన్ వేశారని చెప్పారు. ఆ పార్టీ వారు కుట్రలు చేస్తూ మాపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల రోజు ఏం జరిగినా తనకు సంబంధం లేదని పేర్కొన్నారు.

టిడిపి కంచుకోట కాబోతోంది : ఎంపీ శబరి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సొంత అడ్డా పులివెందుల తెలుగుదేశం పార్టీకి కంచుకోట కాబోతోందని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం పులివెందులలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టిడిపి కుటుంబ సభ్యులంతా జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో కలిసి పాల్గొంటున్నారని తెలిపారు. కడప, పులివెందులకు ఐదేళ్లలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమకు ఒక్క ఇటుక కూడా పేర్చలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొప్పర్తికి రూ.1,500 కోట్లు ఇచ్చిందని చెప్పారు. ఆ డబ్బును దారి మళ్ళించారని ఆరోపించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో దోచుకోవడంతోనే సరిపోయిందన్నారు. వైసిపి నాయకులు ఎన్ని కుట్రలు చేసిన ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగితే వైసిపి గెలవదు : ప్రత్తిపాటి

ఒంటిమిట్ట : జడ్‌పిటిసి ఉప ఎన్నికలు సజావుగా జరిగితే పులివెందులలో వైసిపి గెలవదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ నెల 12న జరగనున్న ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పులివెందులలో గతంలో ఎప్పుడూ స్వేచ్ఛగా ఓటేసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. రౌడీ మూకలను తరమికొట్టేందుకు పులివెందుల ప్రజలు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధిలో దేశానికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రోల్‌మోడల్ అని, సూపర్-6 పథకాలు దేశానికే మార్గదర్శకంగా నిలిచాయని తెలిపారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఉప ఎన్నికలు నిర్వహించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందులలో జరుగనున్న జడ్‌పిటిసి ఉప ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఒంటిమిట్ట, పులివెందుల ఉప ఎన్నికల్లో సిపిఎం ఓటు పరిమితంగానైనా కీలకమైందేనని తెలిపారు. ఈ ఎన్నికలను కడప, అన్నమయ్య జిల్లాలలోని ప్రజాస్వామ్య వాదులందరూ, పౌర సమాజం దగ్గరగా పరిశీలిస్తుందని పేర్కొన్నారు. ప్రజాభీష్టానికి భిన్నంగా ఎన్నికల ఫలితాలు వస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా పరిణమిస్తుందని చెప్పారు. నేడు దేశంలో కాషాయ కూటమి రాజ్యాంగ విరుద్ధంగా ఎన్నికల కమిషన్ ప్రభావితం చేస్తోందనే విస్తృతమైన మీడియా, ప్రధాన ప్రతిపక్షాల విమర్శలకు, చర్చకు ఎన్నికల కమిషన్ జాతీయ స్థాయిలో ప్రజా ఓటును కొల్లగొట్టేందుకు ఆపరేషన్ ఇవిఎం ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎన్‌డిఎ, రాష్ట్రంలో కూటమి ఏకచత్రాధిపత్యం కోసం ఎన్నికల కుట్రలు చేస్తోందని విమర్శించారు. భారత రాజ్యాంగం దేశ పౌరులకు ప్రసాదించిన ఒక మనిషికి ఒక్క ఓటు హక్కుపై దాడి చేసేవారు ఎవరైనా వారి పట్ల ప్రజల విముఖత ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వి.రఘు, సిపిఎం మండల కార్యదర్శి కె.నరసయ్య, మండల కమిటీ సభ్యులు ఎస్.సాంబయ్య, సిద్ధవటం సిపిఎం నాయకులు పి.సురేష్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే...!

చిన్నపాటి వర్షానికే కాలనీలు జలమయం

పట్టని అధికారులు..ఆందోళనలో ప్రజలు



చెరువును తలపిస్తున్న బుడగజంగం కాలనీ రోడ్డు

ప్రజాశక్తి - కడప

కడప నగరంలో చిన్నపాటి వర్షానికే అత్యధిక కాలనీలు జలమయమవుతున్నాయి. రాత్రి సమయాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కడప నగరంలోని కృపాకాలనీ, బుడగజంగం కాలనీ, రామాంజనేయ నగర్, పరమేశ్వర స్కూల్‌వీధి, రామరాజుపల్లి, ఆచారి కాలనీ ప్రాంతాలకు వెళ్లే దారులు చెరువులను తలపిస్తున్నాయి. ఆయా కాలనీల్లో కనీసం మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన ఇక్కడ కాయకష్టం చేసుకుని జీవించే నిరుపేద ప్రజల పరిస్థితి మారడం లేదు. ఇక్కడ చినుకు పడిందంటే చాలు చిత్తడితో ఈ చిన్నపాటి వర్షానికే చెరువు మయంగా మారాయి. ముఖ్యంగా ఈ ప్రాంతాలలో కొన్ని విధుల్లో రోడ్లు, డ్రెయినేజీ కాలువలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఖాళీ స్థలాల్లో మురుగు, వరద నీరు నిల్వ ఉండటం వల్ల స్థానికులు చాలా అవస్థలు పడుతున్నారు. వర్షానికి వచ్చిన నీరు, డ్రెయినేజీ కాలువల్లోని ముగురు నీరు బయటకు పోయేందుకు కాలువలు లేకపోడంతో సమస్య తీవ్రంగా ఉంది. విద్యార్థులు, వృద్ధులు ఈ వరద నీటిలోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కలెక్టర్, కార్పొరేషన్ అధికారులు, పాలకులు స్పందించి ఈ ప్రాంతాలు పర్యటించి మౌనిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పిలుపు

ప్రజాశక్తి-కడప అర్బన్

సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభలు విశాఖలో జరగడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు ఉంటాయని తెలిపారు. ఐదు రోజులు జరిగే మహాసభలు చివరి రోజు నాలుగో తేదీ విశాఖలో పెద్ద ఎత్తున బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ఈ మహాసభలు జయప్రదం చేయడానికి సిఐటియులో ఉన్న అన్ని రంగాల, మండల నాయకత్వం ప్రతి కార్యకర్త, సభ్యుడు జయప్రదానికి కృషి చేయాలని తెలిపారు. దేశంలో కార్మిక వర్గంపై జరుగుతున్న దాడిని చర్చించి, భవిష్యత్తులో ఎలాంటి పోరాటాలు నిర్వహించాలనే ఉద్దేశంతో మహాసభ ఉంటుందని పేర్కొన్నారు. విశాఖలో జరిగే మహాసభలో భవిష్యత్తు కర్తవ్యాలు, ఉద్యమాలు ఎలా చేయాలో రూపకల్పన చేస్తారని తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తుందన్నారు. జిల్లాలో ఉన్న కార్మిక వర్గం సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయడానికి అందరూ తమ శక్తిని మించి పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి బి.లక్ష్మీదేవి, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బైరవ ప్రసాద్, మాజీ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, అంగన్వాడీ యూనియన్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐఎన్.సుబ్బమ్మ, నాయకులు పవన్, రవి, వెంకటపతి, నాగేంద్ర, రమణ, వరలక్ష్మి, దీప, వినిలా, విజయ కుమార్ గోపి, శల్మోన్, శేఖర్, దాసు, వినయ్, విజయ్, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, ఆనందు, ఉదయ్, జిల్లాలో ఉన్న అన్ని రకాల కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ప్రహరీకి భూమిపూజ

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్ : రాయలసీమ ఉక్కు పరిశ్రమతో దేశంలోనే జమ్మలమడుగు నియోజ కవర్గానికి గొప్ప స్థానం లభించబోతుందని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. శనివారం సున్నపురాళ్లపల్లెలో ఉక్కు పరిశ్రమ ప్రహరీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రితో కలిసి ఒక సర్వోన్నతమైన జెఎస్‌డబ్ల్యూ కంపెనీ చేత మన పరిసర ప్రాంతాల్లో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి సన్నద్ధం చేశారన్నారు. ఒకవైపు గండికోట టూరిజం మరోవైపు స్టీల్ ప్లాంట్ పనులు రెండు నియోజకవర్గానికి ఉపాధి కల్పించేవేనన్నారు. గతంలో జగన్ స్టీల్ ప్లాంట్ పేరు చెప్పి మభ్యపెట్టారని తెలిపారు. జెఎస్‌డబ్ల్యూ కంపెనీ ప్రపంచంలోనే అత్యున్నతమైన కంపెనీగా పేరు ఉందన్నారు. నిధుల కొరత లేకుండా అన్ని రకాలుగా మొదటి దశను 2028 అక్టోబర్ చివరి నాటికి ఉత్పత్తి కూడా జరుగుతుందన్నారు. కాంపౌండ్ లేదా ప్రహరీ గోడతో ప్రారంభమై మూడేళ్లలో ప్లాంట్ మొదటి దశ పూర్తవుతుందన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, స్టీల్ ప్లాంట్ ప్రతినిధులు నూర్‌బాషా, సుదర్శన్ మాట్లాడారు. కార్యక్రమంలో దేవగుడి యూత్ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

యూరియా కొరత నివారించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో నెలకొన్న యూరియా కొరతను తక్షణం తీర్చకపోతే ఆందోళన తప్పదని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. శనివారం యూరియా కొరతపై కడపలో ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాలో 77,475 హెక్టార్లు పంటల సాధారణ సాగు విస్తీర్ణంగా అంచనా గట్టి 20,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 12 వేల మెట్రిక్ టన్నులు కేటాయించి చివరకు 4062 మెట్రిక్ టన్నులు ఇచ్చిందన్నారు. అంచనాలకు భిన్నంగా కేటాయించడమే కాకుండా కేటాయించిన వాటిని ఇవ్వకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కెసి కెనాల్ ఆయకట్టు కు నీళ్లు రావడంతో యూరియాకు డిమాండు వచ్చిందన్నారు. గ్రామాలలో ఆర్బికే కేంద్రాలకు మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా అయినా రాజకీయ పలుకుబడి ఉన్నవారికే యూరియా దక్కుతున్నదని తెలిపారు. యూరియా కొరత లేదని అగ్రికల్చర్ జేడి చంద్రనాయక్ చెప్పడం అవాస్తవమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే తెలుస్తుందని చెప్పారు. రాష్ట్రంలో అధికార కూటమీ ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియా ఇప్పించుకోలేకపోతున్నారన్నారు. ఎరువులపై ధరలు మాత్రం ఇబ్బడి ముబ్బడిగా పెంచుతున్న కంపెనీలపై నియంత్రణ చేయడానికి చేతగాని ప్రభుత్వం రైతులకు ఇచ్చే రాయితీలో మాత్రం పట్టుపట్టి కోత విధిస్తోందన్నారు. జిల్లా అరకొరగా వచ్చిన యూరియా కూడా ఆర్బికేలు సొసైటీల ద్వారా అధికారుల చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. బ్లాక్ మార్కెట్లో అధిక రేట్లకు అమ్ముకుంటున్నారని, సామాన్య, పేద రైతులకు యూరియా అందడం లేదని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై నమ్మకం లేదు

- వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

వైసిపి నాయకులను ఎంతమందిని అరెస్టు చేసినా మహిళలే ఎన్నికలు నిర్వహిస్తారని, నాపై దాడి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు స్పష్టమైన సమాచారం ఉందని, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యంపై నమ్మకం పోయేలా ఉందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాడి చేయబోతున్నట్లు టిడిపి నేతలే తనకు చెప్పారన్నారు. నన్ను కాపాడాల్సిన బాధ్యత పోలీసులదే. నాపై దాడి జరిగితే సుమోటోగా స్వీకరించండి. దాడి జరిగితే లోకేష్, బీటెక్ రవినే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. నాకు ఏమైనా జరిగితే సిబిఐతో విచారణ చేయించాలన్నారు. ఇక్కడి పోలీసులతో న్యాయం జరగదన్నారు. పులివెందులలో జరుగుతున్న వ్యవహారాలు రాష్ట్రాన్ని దిగ్భ్రాంతి కల్గిస్తున్నాయని తెలిపారు. నాలుగు రోజుల క్రితం పెళ్లికి వెళ్లిన వారిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. అది మరువక మ మరుసటి రోజు ఒక ఎమ్మెల్సీ, వేల్పుల రాముపై హత్యాయత్నం చేశారని, దాడి చేసిన వారే వైసిపి నేతలపై ఎదురు కేసు పెట్టి ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేశారన్నారు. డిజిపి స్థాయి అధికారి పత్తి వ్యాపారానికి వెళ్లారా అని మాట్లాడుతున్నాడన్నారు. పోలీసులు 100 మీటర్ల దూరంలో ఉండి కూడా దాడి ఆపలేకపోయారన్నారు.

జడ్‌పిటిసి ఉప ఎన్నికలకు పటిష్ట భద్రత : ఎస్‌పి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్ : జిల్లాలో ఈ నెల 12న జరగనున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికలకు భద్రత కట్టుదిట్టం చేసినట్టు ఎస్‌పి అశోక్ కుమార్ తెలిపారు. శనివారం ఉప ఎన్నిక జరిగే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలకు కట్టుదిట్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించామని ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పాత నేరస్తులను 500 మందిని బైండోవర్ చేశామన్నారు. రౌడీషీటర్లకు ఘర్షణలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారం ముగుస్తున్న సందర్భంగా బయట నుంచి వచ్చిన వ్యక్తులు ఉండ కూడదన్నారు. లాడ్జీలు, కళ్యాణ మండపాలు తనిఖీలు నిర్వహిస్తామన్నారు. 48 గంటల నుంచి స్పెషల్ పోలీసులతో గట్టిగా ఏర్పాటు చేశామన్నారు. సిసి కెమెరా, డ్రోన్ల సహాయంతో గట్టిగా ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

దారుణం

ప్రజా'దృష్టి'

జడ్‌పిటిసి ఉప ఎన్నికల ప్రచారంలో హింస చెలరేగడం విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల తరుపున ప్రచారం చేయడం సహజం. జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఇటీవల పులివెందుల ఘటనలో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడికి పాల్పడడం ఆందోళన కలిగించింది. అంతకుముందు ఓ ఫంక్షన్‌కు వెళ్లి వస్తున్న నలుగురు వైసిపి నాయకులపై దాడి చేసిన ఘటనల్ని పరిశీలిస్తే పోలీసుల భద్రతా వైఫల్యం కనిపించింది. ఫ్యాక్షన్ మూలాలను కలిగి ఉన్న గ్రామాల్లో ఉప ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎస్పీ, కర్నూలు రేంజ్ డిఐజితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించడం, ప్రచారాల నిర్వహణపై సీరియస్‌గా దృష్టి సారించడంతో పరిస్థితి అదుపులోకి రావడం ఉపశమనాన్ని కలిగించింది. ఉప ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో చిన్నపాటి ఘర్షణ ఫ్యాక్షన్ తరహా ఉద్రిక్తతలకు దారి తీసే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి ఉపఎన్నికలకు రాజకీయ పార్టీలు ఎనలేని ప్రాధాన్యత ఇవ్వడమే ఉద్రిక్తతలకు కారణమని తెలుస్తోంది. మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి కుమార్తె ఎన్.సునీత దంపతులు ఎస్‌పిని కలవడం, తాజాగా జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో చోటుచేసుకున్న దాడులు..ప్రతిదాడుల వాతావరణాన్ని వైఎస్ వివేకా హత్య వాతావరణంతో పోల్చడం అందరి దృష్టినీ ఆకర్షిం చింది. తాజాగా అన్నదాతా సుఖీభవ పథకం లబ్ధిదారులందరి ఖా తాల్లో నిధులు జమ చేయకపోవడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది. గత సర్కారు హయాంలోని లబ్ధిదారుల ఆధారంగా నిధులు జమ చేయకుండా నిర్లక్ష్యం చేయడం దారుణం. వారికి అర్హత సాధి ంచిన రైతులు, ఇప్పుడెందుకు అర్హత సాధించలేదో పాలకులే వివరి ంచాలి. ఒకవేళ రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడానికి గల కారణాలేమిటి, తప్పిదాలను సరిదిద్దాల్సిన బాధ్యత జిల్లాలోని రెవెన్యూ ఉన్నతాధికారులైన కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్లకు కట్టబెట్టాలి. లేనిపక్షంలో తహశీల్దార్ చిన్నపాటి తప్పిదందొర్లితే చాలు ఉద్దేశపూర్వకంగా నిలుపుదల చేసి, ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా చేయ డానికి యథాశక్తి కృషి చేస్తారనడంలో సందేహం లేదు. ఇప్ప టికైనా రాష్ట్రప్రభుత్వం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించి, వైసిపి సర్కారు హయాం తరహాలో లబ్ధిదారులందరికీ అన్నదాతా సుఖీభవ పథకం వర్తించేలా చూడాల్సి ఉంది. వైసిపి హయాంలోని సంక్షేమాన్ని, కూటమి సర్కారు హయాంలోని సంక్షేమాన్ని పోల్చి చూసుకుంటున్న రోజుల్లో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

తెలుగులో పిహెచ్‌డి పొందిన తొలి పరిశోధకుడు 'చిలుకూరి'



నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపి బ్రౌన్ సిబ్బంది

ప్రజాశక్తి-కడప అర్బన్

తెలుగులో పిహెచ్‌డి పట్టా పొందిన తొలి పరిశోధకుడు డాక్టర్ చిలుకూరి నారాయణరావు అని, ఆయన మద్రాసు విశ్వవిద్యాలయం ద్వారా ఆ పట్టాను సాధించారని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం శనివారం ప్రసిద్ధ భాషావేత్త డాక్టర్ చిలుకూరి నారాయణరావు 137వ జయంతిని నిర్వహించింది. ముందుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు, సిబ్బంది కలసి చిలుకూరి నారాయణరావు చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఆ తర్వాత సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో 'దత్తమండలాలు'గా ఉన్న ప్రాంతానికి 'రాయలసీమ' అనే నామకరణం చేసిన మేధావి చిలుకూరి నారాయణరావు అని పేర్కొన్నారు. ఆయన 1.50 లక్షల తెలుగు సామెతలను సేకరించడం విశేషమన్నారు. ఆయనకు తెలుగుతోపాటు మరాఠీ, జపనీస్, ఉర్దూ లాంటి పలు భాషల్లో ప్రావీణ్యం ఉందన్నారు. సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలక ృష? శాస్త్రి మాట్లాడుతూ నారాయణరావు దాదాపు 240 పుస్తకాలను రచించారని, కానీ దురదృష్టవశాత్తు చాలా పుస్తకాలు అముద్రితాలుగానే మిగిలిపోయాయని పేర్కొన్నారు. ఆయన గొప్ప నాటకకర్త అని, అంబ, అశ్వత్థామ, పెళ్ళి మొదలైన నాటకాలు రచించారన్నారు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా ఆంధ్రవిశ్వవిద్యాలయం వారు 'కళాప్రపూర్ణ' బిరుదుతో, కాశీ సంస్కృత విద్యాపీఠంవారు 'మహామహోపాధ్యాయ' బిరుదుతో సత్కరించారన్నారు. మరో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ ఖురాన్‌ను తెలుగులోకి అనువదించిన తొలివ్యక్తి చిలుకూరివారని అన్నారు. ఆయన జపాన్ - తెలుగు పదకోశం, తెలుగు - జపాన్ పదకోశం, మరాఠీ - తెలుగు పదకోశం, ఆంధ్రాంగ్ల నిఘంటువు, నన్నయ భారత నిఘంటువు వంటి అనేక భాషా గ్రంథాలను రచించా రన్నారు. గడియారం వెంకటశేషశాస్త్రి రచించిన శివాజీ చరిత్రకు 'శివభారతం' అనే పేరుపెట్టింది చిలుకూరివారేనని అన్నారు. గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్ రావు మాట్లాడుతూ చిలుకూరివారు నిరంతర అధ్యయనశీలి అని, చిన్ననాటి నుంచే ఏకసంథాగ్రహిగా ఉండేవారని, గిడుగు రామ్మూర్తి పంతులు శిష్యుడని అన్నారు. మరో గ్రంథాలయ సహా యకులు జి.హరిభూషణరావు మాట్లాడుతూ చిలుకూరి నారాయణరావు మహోన్నత వ్యక్తిత్వాన్ని కొనియాడారు. దుర్భాక రాజశేఖర శతావధానికి స్వర్ణ కిరీట సత్కారాన్ని, గడియారం వెంకటశేషశాస్త్రికి గండపెండేర సత్కారాన్ని జరిపించడంలో చిలుకూరివారే ప్రధాన పాత్ర పోషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది నీలకంఠేశ్వర్, సుమతి, హరికృష్ణ, అరుణకుమారి పాల్గొన్నారు.


ఎస్ఐని సన్మానిస్తున్న ఎంపిపి వీర నారాయణరెడ్డి

బ్రహ్మసాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మసాగర్ నుంచి ఎడమ కాలువకు శనివారం అధికారులు నీటిని విడుదల చేశారు. రైతులు పంటల సాగు నిమిత్తం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి అధికారులచే నీటిని విడుదల చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరమణ, డిఇ మురళీమోహన్, ఇఇ నాగేశ్వరావ్, బి.మఠం ఎంపిపి సి.వీర నారాయణరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షులు నరసింహ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఎంపిపి ఎస్ఐ, డిఇని ఘనంగా సన్మానించారు.

విభజన హామీల అమలుతో రతనాలసీమ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో అమలు కాబోతున్న విభజన హామీలతో రాయల సీమను రతనాలసీమ కానుందని టిఎన్‌టియుసి జిల్లా కమిటీ నాయకులు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. ఆ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో అనంతపురంలో కియా పరిశ్రమ ఏర్పాటైందన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో శనివారం స్టీల్ ప్లాంట్ ప్రాంతంలో రూ.ఐదు కోట్లతో అభివృద్ధి పనులకు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి భూమి పూజ చేశారన్నారు. త్వరలో కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పి4లో భాగంగా చంద్రబాబు విజన్ 2047తో ఆంధ్రప్రదేశ్ ముందుకు తీసుకుపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్, ప్రొద్దుటూరు 130 పిఎస్ ఇన్‌ఛార్జి జహీర్, 33 వార్డు టిడిపి అధ్యక్షుడు పాలగిరి దావూద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కుతుబుద్దీన్

బంగారు కుటుంబాల ఎంపిక

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలం నంద్యాలపేట గ్రామపంచాయతీలో పి4 బంగారు కుటుంబాల గ్రామసభకు నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆసరాలేని పేదలను గుర్తించి వారికి దాతల సహాయం అందించే ప్రయత్నం చేస్తుందన్నారు. అందులో భాగంగా ఎన్నారైలు, దాతలు ముందుకు రావాలన్నారు. ఇప్పటికే సచివాలయ సిబ్బంది గ్రామాలలో సర్వే చేపట్టి అర్హులైన వారిని గుర్తించారన్నారు. గ్రామసభకు ఉపాధి సహాయ పథక సంచాలకులు సుబ్బారెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నాగేంద్రబాబు, ఎపిఎం జయరాజు, పంచాయితీ కార్యదర్శి మాలాద్రి, సచివాలయం సిబ్బంది, విఒ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఆదిశేషారెడ్డి

క్రైం కార్నర్

కత్తులూరు క్రాస్ వద్ద ఆటోను ఢీకొన్న కారు

- ఒక్కరు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని కత్తులూరు క్రాస్ వద్ద ఆటోను కారు ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయ పడ్డారు. ఆటోలో ప్రయాణిస్తున్న గండ్లూరు పుల్లయ్య (55) అక్కడక్కడే మృతి చెందాడు. మృతుడి బంధు వులిచ్చిన వివరాలు మేరకు.. మండలంలోని టి.వెలమ వారిపల్లె గ్రామానికి చెందిన మెకానిక్ పని చేసే వలి అనే వ్యక్తి శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా గండి క్షేత్రానికి తన సొంత ఆటోలో కుటుంబ సమేతంగా బయలు దేరారు. కత్తులూరు క్రాస్ వద్దకు ఆటో రాగానే రాజంపేటకు చెందిన వెంకటరమణ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కారులో పులివెందులకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టాడు. ఆటో సమీపంలో ఉన్న చెట్టును ఢీ కొంది. ఆటోలో ప్రయాణిస్తున్న వారు కింద పడ్డారు. డ్రైవింగ్ చేస్తున్న వలి, చిన్నారులైన సాయాన్, మెహిరున్, వలిమాకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. సంఘటన చూసిన స్థానికులు 108 ద్వారా హుటాహుటిన వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తీవ్ర గాయాలైన సయాన్, మెహిరున్, వలిమాలను మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. రోడ్డు ప్రమాదం జరగడంతోపాటు గండ్లూరు పుల్లయ్య మృతి చెందడంతో వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు టి.వెలమవారిపల్లె ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ యాజమాని పుల్లయ్య మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని బంధువులు వాపోయారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మృతి చెందిన గండ్లూరు పుల్లయ్య

మరో వ్యక్తికి గాయాలు..

చక్రాయపేట మండలంలోని పాయలోపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రెడ్డప్ప అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలంలోని దిన్నెపాడు వడ్డేపల్లెకు చెందిన రెడ్డప్ప తన భార్య పిల్లలతో శనివారం గండి క్షేత్రానికి మోటర్ బైకులో వచ్చి, స్వామి దర్శనానంతరం తిరిగి వడ్డేపల్లెకు మోటర్ బైకులో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన రెడ్డెప్పను వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.


గాయపడిన రెడ్డప్ప

శరవేగంగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు


సిద్ధారెడ్డిపల్లె వద్ద చేపట్టిన కల్వర్టు నిర్మాణం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న నాలుగు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు ఒకొక్కటిగా ముందుకు సాగుతున్నాయి. ప్రస్తుతం గ్రావెల్‌తో రోడ్డు ఏర్పాటు చేసి కల్వర్టులను నిర్మిస్తున్నారు. 2023లో జిపిఎస్ విధానంలో సర్వే చేసి రాళ్లు వేసి హద్దులు ఏర్పాటు చేశారు. గత ఏడాది నుంచి జెసిబి యంత్రాల ద్వారా పంట పొలాలను చదును చేసి గ్రావెల్ తోలి పనులు చేపట్టారు. ప్రారంభంలో గ్రావెల్ తోలే సందర్భంలో పనులు నత్తనడకన సాగాయి. తర్వాత మండల పరిధిలోని అన్ని గ్రామాల పరిధిలో గ్రావెల్ తోలి 8 నుంచి 10 అడుగుల మేర మట్టి రోడ్డు పూర్తి చేశారు. పంట కాలువలకు సంబంధించిన కల్వర్టులను ఏర్పాటు చేస్తున్నారు. చిన్నచాపాటి బ్రిడ్జిల నిర్మాణాలు ప్రారంభించారు. తిప్పిరెడ్డిపల్లె వద్ద పెన్నా నదిపై, అల్లాడుపల్లె వద్ద కుందూ నదిపై బ్రిడ్జిలను ఏర్పాటు చేయాల్సి ఉంది. మండల పరిధిలో అనంతపురం, బూడిదపాడు, కుచ్చుపాప, అల్లాడుపల్లె, సోమాపురం, పిచ్చపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో 350 ఎకరాల వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కోసం ఉపయోగించారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని అనంతపురం జిల్లా కోడికొండ వద్ద హైదరాబాద్–బెంగళూరు 44వ జాతీయ రహదారి నుంచి చెన్నై కలకత్తా హైవేపైకి నూతనంగా నాలుగు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం చేపట్టేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకుంటున్నది. పాత రోడ్డు కాకుండా పూర్తిగా నూతన నాలుగు లైన్ల రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపడుతుంది. అందుకోసం జిల్లాలో 125 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మించేందుకు 2,750 ఎకరాల భూములను వినియోగించనుంది. 60 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ రోడ్డు పూర్తయితే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మన జిల్లా నుండి సులభంగా ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలో పులివెందుల, కమలాపురం, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల గుండా ఈ రహదారి నిర్మించేందుకు డిపిఆర్ సిద్ధం చేశారు. ప్రస్తుతం నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది పనులు పర్యవేక్షిస్తున్నారు. గత నెల నుంచి రోడ్డు పనులు వేగవంతం చేశారు. యర్రగుంట్ల నుంచి పోరుమామిళ్ల వరకు మెగా సంస్థ రోడ్డు పనులు చేపడుతోంది.


సోమాపురం వద్ద యంత్రాలతో కాంక్రీట్ పనులు చేస్తున్న సిబ్బంది

భక్తులతో కిక్కిరిసిన గండి క్షేత్రం


ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో గర్భగుడి

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రసిద్ధి చెందిన గండి క్షేత్రంలో మూడవ శ్రావణ శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. జిల్లా నుండే కాకుండా అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుండి లక్షలాది మంది భక్తులు రావడంతో గండి క్షేత్రం వారితో కిక్కిరిసింది. తెల్లవారుజాము నుండి ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి ఆంజనేయ స్వామి మూల విరాట్‌కు పలు రకాల పాలు, పండ్లు, పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో స్వామి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు దాటి దాదాపు అర కిలోమీటర్ మేర భక్తులు బయట క్యూలో నిలవాల్సి వచ్చింది. ఆంజనేయస్వామి దర్శనం కోసం దాదాపు నాలుగు గంటలు సమయం పట్టింది. 108, 104, బ్లడ్ బ్యాంక్ రక్తదానానికి దాదాపు 20 మంది భక్తులు రక్తదానం చేసినట్లు ప్రసాద్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి మురళీ నాయక్ ఆదేశాల మేరకు సిఐ ఉలసయ్య, ఆర్కేవ్యాలీ ఎస్ఐ రంగారావు, చక్రాయపేట ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వేంపల్లి వైపు నుండి కాలినడకతో వచ్చే భక్తులకు బిజిఎస్ గంగాధర్ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణ దేవాలయం ఆర్గనైజర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంకాలం వరకు అన్నదానం చేశారు. రాయచోటి వైపు నుండి కాలినడకతో వచ్చే భక్తులకు పట్టెం శ్రీరామ్‌మూర్తి, అద్దాలమర్రి క్రాస్ వద్ద నెరుసుపల్లె యువత ట్రాక్టర్‌లో అన్నం తెచ్చి వడ్డించారు. కార్యక్రమంలో గండి దేవస్థాన మాజీ చైర్మన్ వెంకటస్వామి, పోలీస్ శాఖ సిబ్బంది, 108, 104, ఏఎన్ఎం నవనీత, ట్రిపుల్‌ఐటి విద్యార్థులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

రహదారి వెంబడి అన్నదాన శిబిరాలు

వేంపల్లె : శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా మూడవ శనివారం గండి క్షేత్రానికి కాలినడకన భారీ సంఖ్యలో భక్తులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వేంపల్లెలోని రవిరెడ్డి పెట్రోలు బంకు వద్ద నుండి గండి క్షేత్రం వరకు రహదారి వెంబడి దాతలు అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. గండికి వెళ్లే వారికి తాగునీరు, మజ్జిగ, అరటి పండ్లును పంపిణీ చేశారు. ఉదయం అల్పాహారాన్ని కూడా అందజేశారు. వేంపల్లె మీదుగా కాలినడకన వీరపునాయునిపల్లె, వేముల, పులివెందుల, పెండ్లిమర్రి, మండలాల నుండి చాలా మంది భక్తులు కాలినడకన గండికి వెళ్లి శ్రీవీరాంజనీయ స్వామిని దర్శించుకున్నారు. ఎక్కువ సంఖ్యలో తరలి రావడంతో వేంపల్లె భక్తులతో కిటకిటాడింది. తెల్లవారుజామున నుండే ఎక్కువగా మహిళలు కాలినడక గండికి తరలి వెళ్లారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించి, కాలినడకన వెళ్లే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.


వేంపల్లె : కాలినడకన వెళ్లే వారికి అల్పాహారం అందజేస్తున్న దాతలు

సెయిల్ ఆధ్వర్యంలో 'ఉక్కు' ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సెయిల్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయడంలో అన్ని పార్టీలు టెంకాయలు కొట్టి పూజలు చేసి విఫలమయ్యాయని విమర్శించారు. ఇటీవల కడపలో జరిగిన మహానాడులో కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ త్వరలో ప్రారంభిస్తామని చెప్పడం నిరుద్యోగులకు మంచి పరిణామని, అయితే దీన్ని సెయిల్ ఆధ్వర్యంలో నిర్మించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ వస్తే తప్ప కడప జిల్లాలో ఆర్థిక పరిస్థితి మెరుగు పడదని పేర్కొన్నారు. నిరుద్యోగులు తల్లిదండ్రులకు భారమై ఇబ్బందులు పడుతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్, దాని అనుబంధ చిన్నచిన్న పరిశ్రమల ద్వారా నిరుద్యోగం కొంతైనా తగ్గుతుందన్నారు. ఈ మధ్యకాలంలో ప్రజల వద్ద డబ్బులు లేక రియల్ ఎస్టేట్ కూలిపోయిందని, చిన్న వ్యాపారాలు జరగడం లేదన్నారు. కార్మికులకు పనుల్లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

యుటిలిటీ డక్ట్‌లు దుర్వినియోగం జరగకుండా చూడాలి

ప్రజాశక్తి - చాపాడు

నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న యుటిలిటీ డక్ట్‌ల నిర్మాణాలు దుర్వినియోగం జరగకుండా చూడాలని సోమాపురం రైతులు నేషనల్ హైవే అథారిటీ అధికారులను కోరారు. గ్రామానికి చెందిన కిషోర్‌కుమార్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మరి కొందరు రైతులు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో అక్కడక్కడ భవిష్యత్తులో నీటి పైపులైన్లు, కేబుల్ వైర్లు, ఇతర అవసరాల కోసం యుటిలిటీ డక్ట్‌ల పైపులు ఏర్పాటు చేశారన్నారు. అయితే కొంతమంది సిబ్బందిని తప్పుదోవ పట్టిస్తూ ఈ పైపులను ప్రస్తుతం వ్యవసాయ పనులకు సంబంధించిన కాలువలుగా మళ్లించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి యుటిలిటీ డక్ట్‌లను యథావిధిగా ఉంచాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారులందరికీ వినతిపత్రాలను అందజేశారు.




గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నిర్మూలన

ప్రజాశక్తి - ఖాజీపేట

ఏడాది వయసు పైబడిన వారి నుంచి యుక్త వయసు పిల్లల వరకు ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు వాడాలని స్థానిక వైద్యాధికారి ముబీన్ సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి గోడపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం కింద ఆల్బెండజోల్ మాత్రలను అందించేందుకు వైద్యశాఖ సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : పిల్లల శారీరక మానసిక అభివృద్ధికి ఆల్బెండజోల్ మాత్రలు దోహద పడతాయని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బాలయ్య పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం బాలయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో కామనూరు పిహెచ్‌సి వైద్యాధికారి హనీఫ్ బాబ, ఎంఇఒ సావిత్రమ్మ పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా 25వేల మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. సూపర్‌వైజర్లు బిఎ వరప్రసాద్, చంద్రకళ, ఎఎన్ఎంలు జాస్మిన్, హేమ, వెంకటరత్నమ్మ, సునీత, ఆశా కార్యకర్తలు స్వర్ణలత, నాగలక్ష్మి, ప్రభావతి పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. బిపి, షుగర్, ఈసీజీ, 2డిఎకో వాటికి ఉచిత పరీక్షలతోపాటు ఉచితంగా మందులు ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శంకరరావు వీధిలోని శ్రీరాములపేట కాన్పుల ఆసుపత్రి దగ్గర ఉన్న మున్సిపల్ స్కూలులో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ జి.రాజశేఖర్ వర్మ, డాక్టర్ వి వీరప్రసాద్‌రెడ్డి ఎముకలు కీళ్ల నిపుణులు డాక్టర్ బి హరీష్ బాబు, గుండె వైద్య నిపుణులు డాక్టర్ బిఎన్ఎల్ రెడ్డి జనరల్ మెడిసిన్ డాక్టర్ జి.నాగశేఖర్‌రెడ్డి వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఈహెచ్ఎస్‌లతోపాటు అన్ని రకముల ప్రయివేట్ మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పెన్నా నది పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని పెన్నానది పరిసర గ్రామాలైన ఇల్లూరు, హనుమనుగుత్తి గ్రామల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు శోభన్‌బాబు హెచ్చరించారు. తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాలు వస్తుండడంతో గండికోట ప్రాజెక్టులో 16 టిఎంసి నీరు చేరిందన్నారు. గండికోట నుంచి మైలవరం జలాశయానికి నీటిని విడుదల చేశారన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 15 టిఎంసి, మైలవరం ప్రాజెక్టులో 4.5 టిఎంసి నీరు నిలువ ఉన్నట్లు తెలిపారు. పెన్నానదికి శనివారం ఉదయం పదివేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారన్నారు. పెన్నానది పరివాహక ప్రాంతాలైన ఇల్లూరు, హనుమను గుత్తి గ్రామ ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. నదీ పరివాహక చుట్టూ ఎవరూ వెళ్లకూడదని ఆయన హెచ్చరిక జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పులివెందులలో వైసిపి అరాచకాలు సాగవు

ప్రజాశక్తి - చాపాడు

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికలో వైసిపి నాయకుల అరాచకాలు సాగవని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తెలుగుదేశం పార్టీ నాయకులు పోటీలో పాల్గొని ప్రచారాలు నిర్వహిస్తున్నారన్నారు. వైసిపి నాయకులు దౌర్జన్యంతో ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. 2021 సర్పంచ్, ఎంపిటిసి ఎన్నికల్లో వైసిపి నాయకులు ఏ విధంగా దౌర్జన్యాలు చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. ఎలక్షన్ నోటిఫికేషన్‌కు ముందే పోలింగ్ బూత్‌ల వివరాలను ప్రకటిస్తారని వైసిపి నాయకులు గమనించాలన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డితోపాటు మిగిలిన నాయకులు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించి ప్రశాంత పోలింగ్‌కు సహకరించాలన్నారు.